క్లుప్తంగా

ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్‌గా భవాని

ఆకివీడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్‌గా ఎస్.భవాని గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో పని చేస్తున్న ఆమె బదిలీపై ఆకివీడు ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చారు. ఇక్కడ పని చేసిన సూపరింటెండెంట్ శ్రీకర్ ఉద్యోగ విరమణ చేసిన విషయం విదితమే.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



వేంపాడులో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

కాళ్ల: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని కాళ్ల ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు సరాబు సునీల్ తెలిపారు. మండలంలోని వేంపాడు గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరంలో ఆయన వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీరే తాగాలని చెప్పారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులు సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎలాంటి అనారోగ్యం వచ్చినా ప్రభుత్వ వైద్యులను సంప్రదించాలని ఆయన కోరారు.

18న పాలకోడేరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పాలకోడేరు: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఈ నెల 18న మధ్యాహ్నం రెండు గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వి. రెడ్డియ్య తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సమావేశంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష ఉంటుందని సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరకావాలని ఆదేశించారు. అలాగే ఈ సమావేశంలో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నీటి సంఘం అధ్యక్షులు పాల్గొనాలని కోరారు.

చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు

పాలకోడేరు: ఆకివీడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో పాలకోడేరు మండలంలోని శృంగవృక్షం గ్రామంలో అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ సూపర్వైజర్ సూర్య కుమారి ఆధ్వర్యంలో పిల్లలకు గురువారం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు సంవత్సరాలు నిండిన ప్రతి చిన్నారి పేరు తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రంలో నమోదు చేయించుకోవాలని తద్వారా పిల్లలకు పౌష్టికాహారంతో పాటు చదువుపై ఆసక్తి, ఆట పాటల్లో చురుకుగా వ్యవహరించే విధంగా తీర్చిదిద్దే బాధ్యత అంగన్వాడి సిబ్బంది చూసుకుంటారన్నారు.

భీమవరంలో..

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో భీమవరం అర్బన్ సెక్టార్ లో గల దుర్గాపురం 1 అంగన్‌వాడీ కేంద్రం నందు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు పిల్లలచే అక్షరాభ్యాసం చేయించారు. ఐసిడిఎస్ పీడీ శ్రీలక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీ పిలుస్తుంది కార్యక్రమం ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ లక్ష్మీకాంతంపాల్గొన్నారు. .

శిశు మరణాలను తగ్గించాలి



శృంగవృక్షం వెల్‌నెస్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ గీతాబాయి

పాలకోడేరు: శిశు మరణాలను తగ్గించేందుకు అవసరమైన సలహాలు సూచనలు ఎప్పటికప్పుడు గర్భిణులకు చెబుతూ ఉండాలని డీఎం అండ్‌హెచ్‌ఓ గీతాబాయి పేర్కొన్నారు. గురువారం ఆమె శృంగవృక్షం గ్రామంలోని వెల్‌నెస్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణుల్లో, బాలింతల్లో, కిశోర బాలికల్లో పోషకాహార లోపం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలను ఆదేశించారు. ఈమె వెంట సీనియర్ వైద్యాధికారి డాక్టర్ గులాబ్ రాజ్ కుమార్, ఎంఎల్‌హెచ్‌పీలు కనక దుర్గ, దివ్యలక్ష్మి, ఏఎన్‌ఎంలు యు.శశి వెంకటేశ్వరి రత్నకుమారి తదితరులు ఉన్నారు.

ప్రమాదవశాత్తూ వ్యక్తికి గాయాలు

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని దిరుసుమర్రు గ్రామానికి చెందిన మేడిది బుడ్డియ్య తన చెరువు వద్ద పక్షులను బెదిరించేందుకు మందుగుండు సామాను వేరే ప్రాంతం నుంచి తీసుకురాగ గురువారం ప్రమాదవ శాత్తు పేలి గాయాలపాలయ్యాడు. స్థానికులు స్పందించి బుడ్డియ్యను చికిత్స నిమిత్తం భీమవరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

చెత్తతో స్వాగతం పలుకుతున్న పల్లెసీమలు



కాళ్ల డంపింగ్ యార్డును ఆనుకుని వేసిన చెత్తల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను తింటున్న ఆవులు



నిరుపయోగంగా ఉన్న కాళ్ల డంపింగ్ యార్డ్



వేంపాడు గ్రామం ప్రారంభంలో చెత్త వేసిన దృశ్యం

- గ్రామాల్లోని రహదారుల వెంట పేరుకుపోతున్న చెత్త
- డంపింగ్ యార్డులకు చేరని వైనం

కాళ్ల: గ్రామీణ ప్రాంతాలు అనగానే పచ్చని పల్లెలు, ఆహ్లాద వాతావరణం గుర్తుకు వస్తాయి. కానీ గ్రామాల్లో అటువంటి ఆహ్లాదం, పచ్చని వాతావరణం కనిపించకుండా పోతుంది. నియోజకవర్గంలో అన్ని మండలాల్లోనూ కొన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ప్రధానంగా మండలంలో గ్రామాల్లో ఎక్కడ చూసినా చెత్త దర్శనం ఇస్తుంది. డంపింగ్ యార్డులు ఉన్నా అవి అలంకార ప్రాయంగానే మిగిలిపోతున్నాయి. మండలంలో వేంపాడు, కోలనపల్లి, కాళ్లకురుతో పాటు మండల కేంద్రమైన కాళ్ల గ్రామంలో రహదారుల పక్కనే వ్యర్థ పదార్థాలను, చెత్తను నిర్లక్ష్యంగా పడేస్తున్నారు. దీంతో గ్రామంలోకి వచ్చే వారికి దుర్వాసనతో చెత్తతో స్వాగతం పలుకుతున్నాయి. దుర్వాసన వస్తుందని దీనివల్ల వ్యాధులు బారిన పడతామని స్థానికులు, ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంపద సృష్టించే కేంద్రాలకు తరలించాల్సిన చెత్తను రోడ్డు పక్కన వేసి తగలబెట్టడంతో సంపద కేంద్రాలు నిరుపయోగంగా మారుతున్నాయి.

నిలువెత్తు నిర్లక్ష్యం

కాళ్ల మండలం వేంపాడు గ్రామ పరిధిలో ప్రారంభంలోనే గ్రామ పంచాయతీ ఏర్పాటు చేసిన బోర్డు ఆనుకుని చెత్తను వేస్తున్నారు. అధికారులు రోడ్ల పక్కన చెత్త వేయరాదని బోర్డులు ఏర్పాటు చేసినా నిర్లక్ష్యంగా చెత్త, ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలు రోడ్డు పక్కన పారేస్తున్నారు. అంతే కాకుండా మండల కేంద్రమైన కాళ్ల గ్రామంలో ఉన్న సంపద సృష్టి కేంద్రానికి ఆనుకుని చెత్తను వేయడంతో ఆ చెత్తలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను ఆవులు తింటున్నాయంటే పరిస్థితి ఎలాం ఉందో అర్థం చేసుకోవచ్చు. అంతేకాకుండా గ్రామంలో ప్రధాన రహదారి ఆనుకుని మురుగునీరు నిల్వ ఉన్న దోమలు ప్రబలుతున్న దుర్వాసన వస్తున్నా ఎవరూ పట్టించుకున్న పాపాన పోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. రాష్ట్రీయ రహదారిని అనుకుని ఉన్న గ్రామాల్లో తరచుగా చెత్తతో ఉన్న దృశ్యాలు కనిపిస్తూనే ఉంటాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు ఇళ్లల్లో వాడుకునే వ్యర్థ పదార్థాలు తోపాటు ఆఖరికి దుస్తులు పరుపులు లాంటివి కూడా నిర్లక్ష్యంగా రోడ్డు పక్కనే పడేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీని వల్ల ప్రజలకు ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందిగా ఉంటుందని చెబుతున్నారు. అధికారులు స్పందించి రహదారులు వెంబడి వ్యర్థ పదార్థాలు చెత్తాచెదారాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మావుళ్లమ్మకు విశేష పూజలు



అమ్మవారి పూరిగుడి వద్ద గరగనృత్యం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): జేష్ఠమాస జాతర మహోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారి రాత్రి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం రాత్రి మావుళ్లమ్మ అమ్మవారి పూరి గుడి వద్ద శ్రీఅమ్మవారి రాత్రి సేవ కార్యక్రమాన్ని ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ ప్రారంభించారు. అనంతరం గరగల నృత్యం నిర్వహించారు.

చినమిల్లికి అభినందనల వెల్లువ



భీమవరంలో చినమిల్లి వెంకట్రాయుడును అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: వైఎస్సార్ సీపీ భీమవరం నియోజకవర్గ సమన్వయకర్తగా నూతనంగా నియమితులైన చినమిల్లి వెంకట్రాయుడుకు అభినందనలు వెల్లువెత్తాయి. పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో నియోజకవర్గ సమన్వకర్తగా చినమిల్లిని నియమించడంతో పార్టీశ్రేణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. గత కొన్ని నెలలుగా పార్టీ ఇన్‌చార్జ్ లేకపోయినా నియోజకవర్గంలోని నాయకులంతా కలసికట్టుగా పార్టీ అధిష్టానం ఇచ్చిన పిలుపుమేరకు కార్యక్రమాలను విజయవంతం చేశారు. నూతనంగా వెంకట్రాయుడును సమన్వయకర్తగా నియమించడంతో గురువారం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో రాయలం గ్రామంలోని వెంకట్రాయుడు ఇంటికి చేరుకుని పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా చినమిల్లి మాట్లాడుతూ పార్టీ తనకు ఇచ్చిన బాధ్యతలను చిత్తశుద్ధితో పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో విజయవంతంగా నిర్వహిస్తానన్నారు. పార్టీ పటిష్టానికి, ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం పాటుపడతానన్నారు. ఈ కార్యక్రమంలో వేండ్ర వెంకటస్వామి, గూడూరి ఉమాబాల, మేడిది జాన్సన్, ఏఎస్ రాజు, కామన నాగేశ్వరరావు, కోడే విజయలక్ష్మి, పేరిచర్ల విజయనర్సింహరాజు, చిగురుపాటి సందీప్, గాదిరాజు రామరాజు, జల్లా కొండయ్య, చవాలకు సత్యనారాయణ, కోడే యుగంధర్, తిరుమాని ధనుంజయ, పెనుమాల నర్సింహస్వామి, గంటా సుందరకుమార్, చికిలే మంగతాయారు, పాలవెల్లి మంగ,అల్లూరి రవిరాజు తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఉండి: కోలమూరు 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ విద్యుత్ కొత్తలైన్‌లు ఏర్పాటు చేస్తున్న కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కోలమూరు గ్రామంతో పాటుగా సంబంధిత ఏరియాల్లో ఆక్వా చెరువులకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ ఎన్. వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అలాగే యండగండి సబ్‌స్టేషన్ పరిధిలోని ఉణుదుర్రు ఫీడర్‌లో పాతలైన్లు, విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్న కారణంగా గ్రామంతో పాటు ఆక్వా చెరువులకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులు గమనించాలని ఈఈ కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: భీమవరం ఇండస్ట్రియల్ ఏరియాలోని విద్యుత్ ఉపకేంద్రము పరిధిలో కొత్త విద్యుత్ తీగల మార్పిడి నిమిత్తం శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్. వెంకటేశ్వరరావు తెలిపారు. నరసయ్య అగ్రహారం, కోడవల్లి రోడ్, పార్క్ వీధి, ఎఫ్.సి.ఐ.కాలనీ, మార్కెట్ యార్డ్, భాష్యం స్కూల్ రోడ్ ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు. అలాగే భీమవరం కొవ్వాడ లోని విద్యుత్ ఉపకేంద్రము పరిధిలో తీగలకు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలు తొలగింపు నిమిత్తం శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం12 గంటల వరకు పలు ప్రాంతాల్లో శివరావుపేట, జువ్వలపాలెం రోడ్డు, ఇండియన్ హాస్పిటల్ ఏరియాలకు విద్యుత్ సరఫరా విలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్. వెంకటేశ్వరరావు తెలిపారు.

సంక్షేమంలో కూటమి ప్రభుత్వం విఫలం



అర్తమూరులో మాట్లాడుతున్న సీపీఐ మండల కార్యదర్శి వెంకట్రావు

ఉండి: ప్రజలకు సంక్షేమం అందించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐ మండ కార్యాదర్శి కలిశెట్టి వెంకట్రావు అన్నారు. గురువారం మండలంలోని అర్తమూరులో నిర్వహించిన సమావేశంలో ఉండి వీరభద్రరావును శాఖ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వెంకట్రావు మాట్లాడుతూ అధికారం కోసం నోటికొచ్చిన వాగ్ధానాలు ఇచ్చేసి ఆపై అధికారం రాగానే కూటమి ప్రభుత్వం ప్రజలను మోసగించిందని గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా మేము అధికారంలోకి వస్తే గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇంటిస్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామని చెప్పి ఓట్లు వేయించుకున్న కూటమి ప్రభుత్వ పెద్దలు ఇప్పుడు వాటి ఊసే ఎత్తడం లేదని అన్నారు. సూపర్ సిక్స్ అని చెప్పి సూపర్‌గా ప్రజలను మోసం చేశారని ఎద్దేవా చేశారు. ప్రజలకిచ్చిన మాటను మర్చిపోతే నాయకులకు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. అర్తమూరు గ్రామానికి బస్సుసౌకర్యం కల్పించాలని స్థానిక ప్రజలు తీరని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు కోనా గొల్లయ్య, సీపీఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లికి వందనం కాదు వంచన



జి.సుందర్ కుమార్

ఉండి: తల్లికి వందనం సొమ్మును ఇచ్చేస్తున్నామంటూ భారీ ఎత్తున ప్రచారం చేసుకుంటున్న కూటమి ప్రభుత్వం తల్లికి వందనం కాదు వంచన చేస్తుందని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి జి.సుందర్ కుమార్ మండిపడ్డారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఎన్నికలకు ముందు ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటే వారందరికీ తల్లికి వందనం క్రింద రూ.15 వేలు ప్రతీ ఏటా ఇచ్చేస్తామని చెప్పిన కూటమి నాయకులు ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా 87.45 లక్షల మంది పిల్లలు వుంటే 67.27 లక్షల మందికి మాత్రమే ఇవ్వడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. అందరికీ ఇస్తానని చెప్పిన కూటమి నాయకులు ఇప్పుడు కేవలం 58 లక్షల మందికి మాత్రమే ఇచ్చి మిగిలిన 29 లక్షల మందికి ఎందుకు ఇవ్వడం లేదో రాష్ట్ర ప్రజలకు,రాష్ట్రంలోని తల్లులకు చెప్పాలని డిమాండ్ చేశారు. తల్లికి వందనం ఈ ఏడాది ఇచ్చేస్తున్నామని చెప్పుకుంటూ పండుగ చేసుకునేందుకు సిద్ధపడుతున్న కూటమి నాయకులు గతేడాది ఎందుకివ్వలేదో? చెప్పాలని డిమాండ్ చేశారు. అందుకే గతేడాది ఎగ్గొట్టిన సొమ్ముతో కలిపి ఈ ఏడాది ఖాతాల్లో జమ చేయాలని కోరారు.

ఉండి లయన్స్ క్లబ్‌కు నూతన కమిటీ



ప్రమాణ స్వీకారం చేసిన ఉండి లయన్స్‌క్లబ్ నూతన కమిటీతో సీనియర్ నాయకులు

ఉండి: స్థానిక లయన్స్ ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని క్లబ్ ప్రస్తుత అధ్యక్ష, కార్యదర్శులు సత్తి బ్రహ్మారెడ్డి,ముదునూరి శివరామరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. 2025–26 ఏడాదికి గానూ నూతన కమిటీ అధ్యక్షుడిగా డాక్టర్ గాదిరాజు రంగరాజు, కార్యదర్శిగా పెన్మత్స రంగప్రసాద్‌రా,కోశాధికారిగా పెన్మత్స వెంకట జగన్నాథరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో వారు ప్రమాణ స్వీకారం చేసారు. వీరు వచ్చే నెల 1 నుంచి పదవీ బాధ్యతలు స్వీకరిస్తారని వారు తెలిపారు. కార్యక్రమంలో రుద్రరాజు నరసరాజు, రాము, సీతారామరాజు, కాగిత మహంకాళి, అప్పలరాజు, సుబ్బరాజు, భూపతిరాజు హరనాథ రాజు,గాదిరాజు వెంకటేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం



ఆకివీడు జెడ్పీబాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్నభోజన పథకాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

ఆకివీడు: పాఠశాలల ప్రారంభం నుండి విద్యార్థులకు మధ్యాహ్నభోజనంకు సన్న బియ్యాన్ని ఉపయోగించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఎంఈఓ ఏ.రవీంద్ర చెప్పారు. స్థానిక సరోజినీనాయుడు బాలికోన్నత పాఠశాలలో గురువారం మధ్యాహ్నభోజన పథకం, పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. హెచ్‌ఎం ఇందిర మాట్లాడుతూ మధ్యాహ్న భోజనానికి సన్న బియ్యం ఉపయోగిస్తున్నందున విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మోటుపల్లి సత్యనారాయణ, సుబ్బారావు పాల్గొన్నారు.

కోపల్లెలో..

కాళ్ల: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని ఎంపీపీ పెన్మెత్స శిరీషవిశ్వనాథరాజు తెలిపారు. కాళ్ల మండలం కోపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సన్నబియ్యంతో ఏర్పాటు చేసిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని గురువారం ప్రారంభించారు.కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సోమేశ్వరావు, మాజీ ఎంపీపీ ఆరేటి వెంకటరత్న ప్రసాద్, పానకాల కృష్ణాంజనేయరావు పాల్గొన్నారు.

భీమవరంలో..

భీమవరం: స్థానిక పొట్టిశ్రీరాములు(పీఎస్ఎమ్) మునిసిపల్ గరల్స్‌హైస్కూల్లో గురువారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్యే పులపర్తి, రామాంజనేయులు (అంజిబాబు), ఎమ్మెల్సీ బి గోపిమూర్తి, జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టికాహారలోపం లేకుండా ప్రత్యేక మెనూతో ప్రతి రోజూ అందించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. అనంతరం విద్యార్థులకు స్కూల్ బ్యాగ్, పుస్తకాలు పంపిణీ చేశారు. ఆర్డీఓ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్ ఆర్ రాంబాబు పాల్గొన్నారు.

విద్యార్థులు బాగా చదువుకోవాలి

వీరవాసరం: విద్యార్థులంతా చక్కటి విద్యాభ్యాసంతో జీవితంలో పైకి ఎదగాలని ఎంపీపీ వీరవల్లి దుర్గ భవాని కోరారు. వీరవాసరం మద్దాల రామకృష్ణమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మధ్యాహ్నం భోజన పథకాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీమన్నారాయణ, హెచ్‌ఎం ఎం.శ్రీనివాస్ వీరవల్లి చంద్రశేఖర్, శ్రీనివాస్, ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థుల రక్షణ కోసం షీ టీమ్స్ ఏర్పాటు చేయాలి



భీమవరంలో ఆర్డీవో ప్రవీణ్‌కుమార్ రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

భీమవరం: నూతన విద్యాసంవత్సరంలో తరగతులు ప్రారంభమైనందున విద్యార్థుల రక్షణ కోసం షీ టీమ్స్ ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ భీమవరం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆర్డీవో ప్రవీణ్ కుమార్‌రెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ లక్ష్మణ్, బి గణేష్ మాట్లాడుతూ భీమవరం పట్టణం జిల్లా కేంద్రంగానే గాకుండా విద్యా కేంద్రంగా అభివృద్ధి చెందినందున జిల్లా నలుమూలల నుంచి విద్యార్థినిలు ఇక్కడ చదువుకోవడానికి వస్తున్నారని ఇటువంటి తరుణంలో కొంత మంది ఆకతాయిలు విద్యార్థినులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అటువంటి ఆకతాయిలపై చర్యలు తీసుకోడానికి షీ టీం ఏర్పాటు చేసి వారికి రక్షణ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షురాలు బి సింధు, ఎస్ జ్యోతి, కె రోహిత్, పి సాయికృష్ణ పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు

తాడేపల్లిగూడెం (టీఓసీ): విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని ఏఐటీయూసీ నాయకులు అన్నారు. విశాఖ ఉక్కుకు కార్మికుల పోరాటానికి మద్దతుగా తాడేపల్లిగూడెం పట్టణంలో గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో వద్ద ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓడి.సోమసుందర్ మాట్లాడుతూ కార్మికులు సాగిస్తున్న పోరాటాలు విజయవంతం అయ్యే వరకు కార్మికవర్గం అండగా ఉంటుందని తెలిపారు. ఏఐటీయూసీ జనరల్ కౌన్సిల్ పిలుపు మేరకు దేశ వ్యాప్త సంఘీభావ దినం పాటిస్తున్నట్లు చెప్పారు. ఉక్కు పరిశ్రమ నుంచి తొలగించిన సిబ్బందిని తిరిగి విధుల్లో తీసుకోవాలని, కార్మికుల జీతం బకాయిలను చెల్లించాలని, విశాఖ ఉక్కుకు సొంతగనిని కేటాయించాలని, నిజమైన పెట్టుబడి పెట్టాలని, సెయిల్‌లో విలీనం చేయాలని, ప్రయివేటీకరణ విధానాలను విడనాడాలన్నారు. విశాఖ ఉక్కును ఒక పథకం ప్రకారం కార్పోరేట్లుకు కట్టబెట్టేందుకు పరిశ్రమను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు.

భీమవరంలో ప్లాస్టిక్ నిషేధం ఎక్కడ?



భీమవరంలో ప్లాస్టిక్ సీసాలతో ప్రజాప్రతినిధులు, అధికారులకు మంచినీరు అందించిన దృశ్యం

భీమవరం: భీమవరం పట్టణంలో ప్లాస్టిక్ నిషేదం ప్రకటనలకే పరిమితమైంది. జిల్లా వ్యాప్తంగా ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. దీనిలో భాగంగా ముందుగా భీమవరం పట్టణంలో నిషేధం అమలు చేయాలని నిర్ణయించి దానికి అనుగుణంగా కలక్టరేట్‌లో ప్లాస్టిక్ కవర్లు వాడకంతోపాటు ప్లాస్టిక్ మంచినీటి సీసాల వాడకం నిలిపివేసి గాజు, స్టీల్ సీసాలను వాడుతున్నారు. కలెక్టరేట్‌లో అధికారులతో సహా సిబ్బంది సైతం ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉంటున్నారు. అయితే జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్‌కుమార్‌రెడ్డి భీమవరం మునిసిపాల్టీగా ప్రత్యేక అధికారిగా ఉన్నా పట్టణంలో ప్లాస్టిక్ నిషేధం అంతంతమాత్రమే. గురువారం పట్టణంలోని పీఎస్ఎం గరల్స్ హైస్కూల్లో నిర్వహించిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభానికి వచ్చిన ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి, జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డికి ప్లాస్టిక్ సీసాలతో తాగునీరు అందించి ప్లాస్టిక్ నిషేధం ఏ మేరకు అమలు జరుగుతుందో సాటిచెప్పారు.

చిక్కాల రాజు మృతి పార్టీకి తీరని లోటు



రాజు మృతదేహానికి నివాళులర్పిస్తున్న మండలి చైర్మన్ మోషేన్‌రాజు

వీరవాసరం: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, బాలేపల్లి మాజీ సర్పంచ్ చిక్కాల రాజు అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు రాజు మృతదేహానికి నివాళులర్పించారు. చిక్కాల రాజు మృతి తీరని లోటని అన్నారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చవాకుల సత్యనారాయణమూర్తి, మాజీ మండల కన్వీనర్ నేతల జ్ఞాన సుందరరాజు, గూడూరి ఓంకారం ఉన్నారు.

119 స్పౌజ్ పింఛన్ల మంజూరు

పాలకోడేరు: మండలంలోని కొత్తగా 119 స్పౌజ్ పింఛన్లు మంజూరయ్యాయని ఎంపీడీవో వి. రెడ్డియ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయాల వారీగా పాలకోడేరు-1 ఐదు , పాలకోడేరు-2 ఎనిమిది, గరగపర్రు 11, గొరగనమూడి రెండు, గొల్లలకోడేరు 8, మోగల్లు -1 తొమ్మిది, మోగల్లు -2 ఐదు, వేండ్ర 9, పెన్నాడ -1 నాలుగు, పెన్నాడ -2 మూడు, కొండేపూడి ఆరు, కోరుకొల్లు 8, కుముదవల్లి ఆరు, విస్సాకోడేరు -1 పదకొండు, విస్సాకోడేరు -2 ఐదు, శృంగవృక్షం -1 ఏడు, శృంగవృక్షం -2 నాలుగు, శృంగవృక్షం -3 ఎనిమిది మంజూరైనట్లు తెలిపారు.